
# జారుడు మెట్లు - జారని కాళ్లు



'ప్రభవ' మాస పత్రిక . . . ఆగస్టు, 1978

వేవేసవి సెలవులు ఇచ్చారు.

ప్రతి సంవత్సరం కూడా కొన్నికొన్ని కాలేజీల నుంచి, కొంతకొంత మంది లెక్చరర్లను ఎన్నుకొని వారందరినీ ఒకచోట సమావేశపరచి, రిఫ్రెషర్ కోర్సులను నడపడం పరిపాటి.

ఈసారి రిఫ్రెషర్ కోర్సులను బెంగుళూరులో ఏర్పాటుచేశారు.

అనుకోకుండా ఈసారి ఆ కాలేజీ నుంచి ప్రకాష్‌కి ఆహ్వానం వచ్చింది. స్వంతంగా ఏ ప్రయత్నమూ చేయకుండా, ఎవరిచేతా రికమెండ్ చేయించకుండానే తనకి ఈ అవకాశం వచ్చినందుకు ఉబ్బితబ్బిబ్బయ్యాడు ప్రకాష్.

ఆహ్వానాన్ని అందుకుని వచ్చిన లెక్చరర్లందరికీ 'హోటల్ ఎయిర్‌లైన్సు'లో వసతి ఏర్పాటుచేశారు. జెంట్స్‌కి డబుల్ రూమ్, లేడీస్‌కి సింగిల్ రూమ్ ఏర్పాటుచేశారు. 'లేడీస్' అనడం పొరపాటు. ఎందుకంటే... మొత్తం వచ్చినవాళ్ళు పదకొండు మందయితే- అందులో ఒకే ఒకరు లేడీ!

ఆమే... జయంతి!!

నిజానికి జయంతి లెక్చరర్ కాదు. బెంగుళూరు యూనివర్శిటీలో ఎం.ఏ. చదువుతోంది. ఈ సమావేశం బెంగుళూరు యూనివర్శిటీ వారి ఆధ్వర్యంలో జరగడం వల్లఆ నిర్వాహకులు జయంతిని అతిథుల సౌకర్యాలు చూడడం కోసం, వారి గోష్ఠులను గమనించడం కోసం నియమించారు. అందరితో పాటు ఆమెకీ ఒక గదిని కేటాయించారు.

హోటల్లో వసతి, భోజన సదుపాయాలే కాకుండా కాన్ఫరెన్సు హాల్ కూడా ఉండడంతో చాలా సౌకర్యంగా ఉంది.

సమావేశం మొదటిరోజున- ఆహ్వానితులందర్నీ కాన్ఫరెన్సు హాలులో సమావేశ పరిచారు. పరస్పర పరిచయాలు అయ్యాయి. అంతమంది మగవారిలో స్త్రీ తానొక్కతేయైన కారణంగానో, ఏమో... జయంతి చాలా ముభావంగా కూర్చుంది.

పరిచయాన్ని ఎవరికి వారు క్లుప్తంగా చేసుకున్నారు. జయంతి తల వంచుకొని సన్నని కంఠంతో తన పేరు, వివరాలు చెప్పింది. ఆమె మాట్లాడుతుంటే ప్రాతఃకాలంలో వీణ మ్రోగినట్లే అనిపించింది.

ప్రకాష్ స్వతహాగా స్ఫురద్రూపి. చక్కని మాటకారి, చాలా చలాకీగా ఉంటాడు. అతన్ని చూడగానే ఎటువంటి వారైనా ఆకర్షితులవుతారు. అతను తన పేరు, హైదరాబాద్‌లో తను పనిచేస్తున్న కాలేజీ వివరాలు చెప్పి కూర్చున్నాడు.

సమావేశాధ్యక్షులు అందుకొని- 'ప్రకాష్ ఆంధ్రాంగ్ల భాషలలో మంచి రచయిత' అని అదనంగా పరిచయం చేశారు. ఆ క్షణంలో అందరి కళ్ళూ అతని మీదే కేంద్రీకృతమయ్యాయి.

జయంతి కూడా, ఒక్కసారి అతని ముఖం వంక ఆసక్తిగా చూసింది- మిలమిలలాడే పెద్దకళ్ళతో. ప్రకాష్ కూడా ఆమెవంక చూశాడు. ఇద్దరి చూపులూ కలిసేసరికి తట్టుకోలేక తల దించుకుంది జయంతి.

అటుతర్వాత- ఆ సమావేశం యొక్క లక్ష్యాలు, కార్యక్రమ వివరాలూ, వివరించబడినాక, భోజనాల కోసం ఆ సమావేశాన్ని అప్పటికి ముగించారు.

భోజనాల సమయంలో తాను నవ్వుతూ, అందర్నీ నవ్విస్తూ, ఎంతో ఉత్సాహంగా కనిపించాడు ప్రకాష్. ఆ స్వల్పకాలంలోనే అతను అందరికీ ప్రీతిపాత్రుడయ్యాడు. ప్రకాష్ ఛలోక్తులను మౌనంగా వింటూ మనస్సులోనే ఆనందించసాగింది జయంతి. అతనితో మాట్లాడాలని మనస్సు ఆరాటపడుతున్నా సభ్యత, సాంప్రదాయం, బిడియం అడ్డువచ్చి ఆమె పెదవి విప్పలేకపోయింది.

రాత్రి భోజనాల వేళ- అనుకోకుండా ప్రకాష్, జయంతి ఎదురెదురుగా కూర్చోవడం జరిగింది. అనుకోకుండా జరిగిన ఆ ఆహ్లాదకరమైన సంఘటనకు మనస్సులో ఏహో తెలియని ఆనందానుభూతిని పొందింది జయంతి.

సర్వర్ ఆకులలో పదార్థాలు వడ్డించి వెళ్లాడు. అందులో ఒక కూరని చూసి, అదేమిటని వ్రేలితో అటూ ఇటూ కదిపి పరీక్షించసాగాడు ప్రకాష్.

"అదే కూరో చెప్పగలరా?" అంది జయంతి ఇంగ్లీషులో.

"ఉహుం... తెలియడం లేదు!" అన్నాడు ప్రకాష్ ఇంగ్లీషులోనే.

జయంతికి తెలుగు రాదు. ఆమె మాతృభాష కన్నడం. ప్రకాష్‌కి కన్నడం రాదు. అందువల్ల వారి సంభాషణ ఇంగ్లీషులోనే సాగింది.

"ఇది పనసకాయ కూర! మా రాష్ట్రంలో పనసకాయలు బాగా పండుతాయి. అందువల్ల రకరకాల కూరలు, ఊరగాయలు, పచ్చళ్ళు, అప్పడాలు వంటివి పెడ్తాము" అంది జయంతి.

"ఏమిటీ..? పనసతో పచ్చళ్ళూ, అప్పడాలూ కూడా పెడ్తారా? అవి మాకు తెలీదు. మా కోస్తా ఆంధ్రలో పనసకాయలు పండుతాయి. మేము పనసపళ్ళూ తింటాం. కాయతో కూర చేసుకొంటాం. మిగిలినవి తెలీదు" అన్నాడు ప్రకాష్ ఆశ్చర్యంగా.

"పంట ఎక్కువగా ఉన్నప్పుడు వాటిని నిలవవుంచే పద్ధతులు కూడా ఉంటాయి కదా!" అంది జయంతి.

ప్రకాష్ కొంచెం వట్టికూరని రుచి చూశాడు.

"ఓఁ... దిసీజ్ రియల్లీ మార్వెలెస్! ఇది మీ కన్నడ స్పెషాలిటీ లాగుందే!" అన్నాడు.

"మాకు ఇది తినీ తినీ విసుగు పుడ్తుంది. మీకు కొత్త కాబట్టి అంత రుచిగా అనిపిస్తోంది. మీ వంటలు మాకూ అలాగే అనిపిస్తాయి" అంది జయంతి నవ్వుతూ.

"యూ ఆర్ కరెక్ట్! అందుకనే మా తెలుగులో 'పొరుగింటి పుల్లకూర రుచి' అనే సామెత ఉంది!"

– అన్నాడు ప్రకాష్– మరికొంచెం కూరను నోట్లో పెట్టుకుంటూ.

"మాకూ అటువంటి సామెతలున్నాయి. అదిసరే కాని, మీకు చాలా బహుమతులు కూడా వచ్చాయటగా? మీ కథల్ని సినిమాలుగా కూడా తీశారుటగా?" అంది జయంతి చిరునవ్వుతో.

ప్రకాష్ ఆశ్చర్యానికి అంతులేకపోయింది.

"అరెఁ... ఈ వివరాలేవీ నేను చెప్పుకోలేదే? మీకెలా తెలుసు?" అన్నాడు.

"సంస్కారమున్న వ్యక్తులు తమ గురించి ఎప్పుడూ గొప్పగా చెప్పుకోరు. ఆ తర్వాత ఛైర్మన్‌గారు ఈ విషయాలన్నీ చెప్పారు. తెలుగు నాకెలాగూ తెలీదు. మీ ఇంగ్లీషు రచనలేవైనా ఉంటే ఇవ్వండి... చదువుతాను. నాకు సాహిత్యం అంటే చాలా ఇష్టం. అందుకే ఎం.ఏ.లో జర్నలిజం తీసుకున్నాను" అంది జయంతి.

"ఓఁ... అలాగే! రెండో మూడో నా పెట్టెలో ఉన్నాయి. భోజనం చేశాక నా రూమ్‌కి రండి... ఇస్తాను" అన్నాడు ప్రకాష్.

భోజనం అయ్యాక ప్రకాష్, జయంతితో తన రూమ్‌కి వెళ్లాడు. పెట్టెలోంచి తన రచనలున్న మూడు పత్రికలు తీసి ఆమెకి ఇచ్చాడు– తన రచనలున్న పేజీలు తీసి చూపిస్తూ.

ఒక పత్రికలో ఒక చిన్న ఆంగ్లపద్యం ఉంది. అది చదివి, "మీరు ఎంతబాగా వ్రాస్తారండీ! దురదృష్టవశాత్తూ నాకు తెలుగు రాదు. వచ్చి ఉంటే, మీ తెలుగు రచనలు కూడా చదివి ఆనందించగలిగేదాన్ని!" అంది.

"తెలుగూ, కన్నడం కవలపిల్లల లాంటివి! మీరు కావాలనుకుంటే తెలుగు మీకు చాలా తేలికగా వస్తుంది!" అన్నాడు ప్రకాష్.

"నాకు తెలుగంటే చాలా ఇష్టం! 'తెలుగు తేట, కన్నడం కస్తూరి' అనే సామెత నాకు తెలుసు. అప్పుడప్పుడు తెలుగు సినిమాలు చూస్తుంటాను. తెలుగు సంగీతం రేడియోలో వింటుంటాను త్యాగరాయ కీర్తనలంటే నాకు ప్రాణం! తెలుగు తియ్యనిది కనుకనే మా మైసూర్ వాసుదేవాచార్ వంటి కన్నడులు కూడా తెలుగులో కీర్తనలు రచించారు" అంది జయంతి- సంతోషం ముఖంలో తాండవిస్తుంటే.

"తెలుగంటే మీకున్న ఇంట్రెస్ట్‌కి నాకు చాలా సంతోషంగా ఉంది. మీతో పరిచయం అయినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది" అన్నాడు ప్రకాష్.

ప్రకాష్ ఇచ్చిన పుస్తకాలు తీసుకొని జయంతి తన గదికి వెళ్లిపోయింది. ఆమె మనస్సు అవ్యక్తమైన ఆనందంతో పరవశించి పోతోంది. ప్రకాష్‌ని గురించిన తలపులే ఆమెను వెన్నాడుతున్నాయి. మనస్సు తనకి తెలియకుండానే అతని సాన్నిహిత్యాన్ని కోరుతోంది.

కలతనిద్రతో ఆ రాత్రి గడిచింది జయంతికి.

మర్నాడు సమావేశంలో ప్రకాష్‌కి సాధ్యమైనంత దగ్గరలో కూర్చోసాగింది జయంతి. బిడియం వదిలేసి కల్పించుకుంటూ, తరచుగా అతనితో మాట్లాడసాగింది.

జయంతిది చామన ఛాయ! చక్కని నిండైన విగ్రహం, అందమైన పెద్దపెద్ద కళ్ళు! వాటి వెంట్రుకలు పొడుగ్గా ఉండి, ఆ కళ్ళకి మరింత అందాన్ని సమకూరుస్తున్నాయి. నవ్వుతుంటే సొట్టపడే బుగ్గలు, చక్కని పలువరుస, తీయని గొంతు... ఇవన్నీ ఆమెకి విశేషమైన ఆకర్షణని సమకూరుస్తున్నాయి. దీనికితోడు- ఆమె మాట్లాడే స్వచ్ఛమైన ఇంగ్లీషు, ఆ మాట్లాడే తీరు, ఆమె మాటల్లో వ్యక్తమయ్యే సంస్కారం ఇవన్నీ ఎటువంటివారికైనా ఆమెపై గౌరవభావాన్ని ఇనుమడింపచేస్తున్నాయి.

ప్రకాష్ ఉంటున్నది డబుల్ రూమ్! అందులో ఉంటున్నది రెండోవాడు రామారావు. అతనూ కన్నడవాడే! అతను బెంగుళూరులోనే లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి మొదటి పరిచయంతోనే జయంతి అంటే విశేషమైన ఆకర్షణ కలిగింది. ఆమె వెంటవెంటనే తిరుగుతూ, ఏదోవిధంగా ఆమెతో మాట్లాడాలని ప్రయత్నం చేయసాగాడు. కాని, జయంతి అతని మాటలకు ముభావంగా సమాధానం చెప్తూ తప్పించుకుని తిరగసాగింది.

సమావేశం మూడోరోజున మధ్యాహ్నం బోజనాలయ్యాక ఎవరి గదుల్లో వారున్నారు.

ప్రకాష్ తన మంచం మీద పడుకుని విశ్రాంతి తీసుకుంటున్నాడు. రామారావు సిగరెట్ల కోసం బయటికెళ్లాడు.

"నిద్రపోతున్నారా?" అంటూ వచ్చింది జయంతి.

ఆమె మాట విని పడుకున్నవాడు లేచికూర్చుని, "లేదండీ... రండి!" అన్నాడు ప్రకాష్.

జయంతి వచ్చి చనువుగా ప్రకాష్ ప్రక్కనే అతని మంచంమీద కూర్చుంది.

ప్రకాష్ సిగ్గుపడుతూ లేచి, ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

"కూర్చోండి... ఫర్వాలేదు. నేను వచ్చానని మీరు లేవడం ఎందుకు?" అంది జయంతి నవ్వుతూ.

"లేదండీ... నేనే లేద్దామనుకుంటుంటే మీరు వచ్చారు!" అంటూ ఒక పేపర్ తీసుకున్నాడు ప్రకాష్.

"మీరు లేచినా నేను లేవలేను బాబూ! నాకు చాలా బద్ధకంగా ఉంది. నా రూమ్‌కి కూడా వెళ్లలేను... ఇక్కడే పడుకుంటాను. మీకేమీ అభ్యంతరం లేదుగా?" అంది జయంతి నడుం వాలుస్తూ.

"అబ్బే... ఏం ఫర్వాలేదు. అలాగే పడుకోండి!" అన్నాడు ప్రకాష్.

"ఇది మీ పక్కయేగా?" అంది జయంతి మళ్లీ.

"అవును..." అన్నాడు ప్రకాష్ ఇరకాటపడుతూ.

జయంతి విశ్రాంతిగా పడుకుంది. తలక్రింద రెండు దిండ్లు ఉన్నాయి. వాటిల్లో ఒక దిండుని తీసుకుని దానిని హృదయానికి హత్తుకుని గట్టిగా కౌగిలించుకుంది.

"ఐ కాంట్ లీవ్ దిస్ బెడ్! ఐ వాంట్ టు స్లీప్ హియర్ టు నైట్!" అంటూ ఆ దిండుని మరింత గట్టిగా హృదయానికి హత్తుకోసాగింది. అవ్యక్తమైన ఆనందంతో, ఆమె కళ్ళు మూతపడ్డాయి.

జయంతి ప్రవర్తనను గమనిస్తూ చాలా ఇరకాట పడసాగాడు ప్రకాష్. ఏమి మాట్లాడాలో తెలియక మౌనంగా ఉండిపోయాడు.

"హల్లో జయంతీ... ఎప్పుడు వచ్చారు?" అంటూ ప్రవేశించాడు రామారావు.

ఉలిక్కిపడి లేచింది జయంతి... దిండుని ప్రక్కన పడేసింది.

రామారావు చనువుగా ఆమె ప్రక్కన కూర్చున్నాడు.

ఇరకాటపడ్తూ లేచినుంచుంది జయంతి.

"నేను వెళ్లొస్తానండీ... నాకోసం ఒక స్నేహితురాలు వస్తానంది!" అంటూ వెళ్లిపోయింది జయంతి.

తనపై కోరిక లేని నావెంట పడుతుంది జయంతి. తనని ఛీదరించుకునే జయంతి వెంట పడ్తున్నాడు రామారావు! అందని పళ్ళకు అర్రులు చాచడం ఇదేనన్నమాట!' అనుకున్నాడు ప్రకాష్.

ఆ రాత్రి భోజనాలు అయ్యాక "పుస్తకమిస్తాను... తీసుకెళుదురుగాని!" అంటూ ప్రకాష్‌ని తన రూమ్‌కి తీసుకువెళ్లింది జయంతి.

పుస్తకం ఇచ్చాక -

"ఏవండీ... రాత్రి నాకు చాలా భయంకరమైన కల వచ్చింది. అది తలచుకుంటే ఇప్పటికే వళ్ళు జలదరిస్తుంది. ఒక్కర్తినీ పడుకోవాలంటే భయం వేస్తోంది. ఈ రాత్రి మీరూ నాకు తోడుగా ఇక్కడే పడుకోకూడదూ?!" అంది జయంతి.

ఆమె మాటలకు నివ్వెరపోయాడు ప్రకాష్.

"చూడండీ... ఎంతైనా నేను పరాయి మగవాడిని! పైగా... ముగ్గురు బిడ్డల తండ్రిని! మీ గదిలో పడుకున్నందుకు నాకేమీ నష్టం లేకపోయినా, మీకు మంచిది కాదు. పైగా ఇది మీ ఊరు. తాటిచెట్టు క్రింద నుంచుని పాలు త్రాగినా కల్లు త్రాగామనుకుంటారు... గుడ్‌నైట్!" అంటూ వచ్చేశాడు ప్రకాష్.

మర్నాడు సాయంత్రం కొచ్చిన్ పార్కు ఆడిటోరియంలో మంచి నాటక ప్రదర్శన ఉంటే- సమావేశానికి వచ్చినవారంతా చూడటానికి వెళ్లారు. ప్రదర్శన ఏడు గంటలకి కాని మొదలు కాదు. ఇంకా అర్ధగంటకు పైగా టైము ఉంది.

"మనం అలా లాన్సులో కూర్చుందాం రండి!" అంది జయంతి- ముందుకి దారితీస్తూ.

మౌనంగా ఆమెని అనుసరించాడు ప్రకాష్.

ఇద్దరూ వెళ్లి ఒక చెట్టుక్రింద పచ్చిక మీద కూర్చున్నారు. శీతాకాలమేమో బాగా చీకటి పడింది. ముఖాలు పరస్పరం అస్పష్టంగా కనిపిస్తున్నాయి.

"మీతో ఒక విషయం చెప్పాలి..!" అంది జయంతి.

"చెప్పండి..." అన్నాడు ప్రకాష్.

"నా ప్రవర్తన మీకు వింతగా కనిపిస్తోంది కదూ?" అంది జయంతి.

ప్రకాష్ ఏమీ మాట్లాడలేదు.

"నాకు మీరంటే తీరని వ్యామోహం కలిగింది. నా భావాలని నేను అణచుకోలేక పోతున్నాను. నాకు తెలుసు- మీరు వివాహితులనీ, పిల్లలు గలవారనీ! అయినా మీనుంచి

దృష్టిని మరల్చుకోలేకపోతున్నా! నాలో నిత్యమూ పెనుతుఫాను లాగా సంఘర్షణ చెలరేగుతోంది. నేను మీకు ఎంత దూరం కావాలనుకుంటున్నానో మానసికంగా అంత దగ్గరైపోతున్నాను. నాకు మిమ్మల్ని వివాహం చేసుకునే అదృష్టం లేదని తెలుసు. అయినా మీ పొందు కోరుతున్నా! నేనూ వివాహిత నయ్యుంటే భర్తకు ద్రోహం చేస్తున్నానని బాధపడవలసి వచ్చేది. కాని, అవివాహిత నవడం వల్ల ఏదో పొరపాటు చేశానని సరిపెట్టుకోగలను. పెళ్ళయితే మాత్రం భర్తకి ద్రోహం చేయలేను. రేపటితో మన కోర్సులు అయిపోతాయి. ఎవరి దారిన వాళ్ళు వెళ్లిపోతాం. అందువల్ల మీరు ఈ ఒక్కరాత్రి నాతో గడపండి! ఆ ఒక్క అనుభవం- నా జన్మజన్మల పుణ్యంగా భావించుకుంటాను" అంది జయంతి ఆవేశంగా. చివరి మాటలు అంటుంటే ఆమె గొంతు గాద్గదికమైంది.

భారంగా నిట్టూర్చాడు ప్రకాష్.

"చూడండి జయంతీ! మీ భావాలనూ, బాధనీ నేను అర్థంచేసుకోగలను. మీపట్ల నాకు పూర్తి సానుభూతి ఉంది. కొన్ని పరిస్థితుల్లో అనుకోకుండా బలీయమైన ఆకర్షణలకు లోనవుతాం. శారీరకంగా, మానసికంగా ఎంత చేరువ కాగలిగితే అంత చేరువ కావాలని కోరుకుంటాం. కానీ... ఆలోచనలకీ, ఆచరణకీ మధ్య అగాధం చాలా ఉంటుంది. మన సమాజంలో మన సంస్కృతీ, మతం వంటివి మనకి కొన్ని నైతిక విలువలను ఏర్పరచాయి. వాటిని ఉల్లంఘిస్తే కలిగే నష్టం పురుషుడు కంటే స్త్రీకే ఎక్కువ. అదిసరే, మీరే అన్నారు కదా... వివాహమయ్యాక పరపురుషునితో సంబంధం పెట్టుకొని నా భర్తకి ద్రోహం చెయ్యలేనని! నేను వివాహితుడిని... పరస్త్రీతో సంబంధం పెట్టుకొని నా భార్యకు ద్రోహం చెయ్యలేను. నేను కూడా అవివాహితుడనైయ్యుంటే... బహుశా మీలాగే మనస్సుకి సమాధానం చెప్పుకొని మీ కోరిక తీర్చి ఉండేవాడినేమో! నిజం చెప్పాలంటే నాకు కూడా మీరంటే విశేషమైన ఆకర్షణ ఏర్పడింది. కాని, దానిని కేవలం మనస్సుకి పరిమితం చేసుకొంటున్నా! అందని పండుకి అర్రులు చాచడంలో కూడా కొంత తృప్తి ఉంది. నేను ఇంతకంటే ఏమీ చెప్పలేను... అసహాయుడిని!" అన్నాడు ప్రకాష్.

నిర్లిప్తంగా నవ్వింది జయంతి.

"నాకు తెలుసు... నా కోరిక నెరవేరేది కాదని! కాని, మనస్సులోని సంఘర్షణని మీముందు ఉంచితే మనస్సు తేలిక పడ్తుందని చెప్పాను. నన్నర్థం చేసుకున్నారు... నాకంతే చాలు. నేనూ మానసికంగా మీకు చేరువై, ఊహల్లోనే ఆనందం పొందుతాను. మీరు ఎక్కడున్నా నన్ను మరిచిపోకుండా ఉంటే అంతేచాలు!" అంది జయంతి.

నాటక ప్రదర్శన మొదలుపెడ్తున్నట్లుగా ఆడిటోరియంలో గంట మ్రోగింది.

జయంతీ, ప్రకాష్ మౌనంగా లేచారు.

●

సమావేశాలు మర్నాడు అయిపోయాయి.

సాయంత్రం రైలుకి బయలుదేరాడు ప్రకాష్.

అతన్ని సాగనంపడానికి స్టేషన్‌కి వచ్చింది జయంతి. వచ్చిందే కాని, ఎక్కువగా ఏమీ మాట్లాడనే లేదు.

రైలు కదలబోతుండగా... "ఉత్తరాలు వ్రాస్తూండండి!" అంది.

రైలు వెళ్లిపోతుంటే శిలావిగ్రహం లాగా నిలబడిపోయింది. ఆపాలని ప్రయత్నించినా ఆగకుండా కన్నీరు ఆమె చెక్కిళ్ళ మీదకి కారసాగింది. ఆ దృశ్యం చూసేసరికి ప్రకాష్ గుండెలు పిండివేసినట్లయింది. రైలు వేగంగా వెళ్తున్నా ఆమె దీనవదనమే అతని మనస్సుని వెంటాడసాగింది.

ప్రకాష్ హైదరాబాద్ చేరిన తర్వాత జయంతి ఎప్పుడూ ఉత్తరాలు వ్రాయలేదు. ఆమె అతన్ని మరిచిపోయిందా? అది అసంభవం. ఉత్తరాలు వ్రాసి కొత్త ఆశలు ఎంచుకొని బాధపడడం కంటే కలిగిన అనుభవాన్ని నెమరువేసుకొంటూ తృప్తిపడసాగింది.

ఆ కారణం చేతనే ప్రకాష్ కూడా ఆమెకి ఉత్తరాలు వ్రాయలేదు.

అయినా... మానసికంగా వారిద్దరూ సన్నిహితులే.

ఆ అనుబంధం అనిర్వచనీయం!

'ప్రభవ' మాస పత్రిక . . . ఆగస్టు, **1978**

అమ్మకానికి అందుబాటులో ఉన్న
కె.ఆర్.కె. మోహన్ ఇతర రచనలకై ఈ పుస్తకం చివరి పేజీల్లో చూడండి...